ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
నారాయణపేట
జిల్లా వార్తలు
ఆదివారం 15 సెప్టెంబరు 2024
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 । కనిష్ఠం : 22.0



కొండారెడ్డిపల్లిలో..
అభివృద్ధి పరుగులు

- సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామంలో రూ.40 కోట్లతో పనులు
- గ్రామ పంచాయతీ భవనం పూర్తి
- నిర్మాణంలో పశువైద్య కేంద్రం, గ్రంథాలయం, బీసీ కమ్యూనిటీ హాల్
- రూ.38 కోట్లతో రోడ్ల పనులు మంజూరు
- సౌర విద్యుత్ కోసం పైలట్ గ్రామంగా ఎంపిక
- దసరా రోజు ప్రారంభించనున్న రేవంత్‌రెడ్డి

సీఎం తండ్రి జ్ఞాపకార్థం నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం



వంగూరు, సెప్టెంబరు 14: సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. కలెక్టర్ బదావత్ సంతోష్ పనులను పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలో రూ.40 కోట్లతో పనులు జరుగుతున్నాయి. రైతుల కోరిక మేరకు గ్రామానికి ప్రభుత్వం పశువైద్య కేంద్రాన్ని మంజూరు చేసింది. తాత్కాలికంగా అద్దె భవనంలో కొనసాగుతున్న కేంద్రానికి రూ.45 లక్షలతో పక్కా భవనం నిర్మిస్తున్నారు. పనులు చివరి దశలో ఉన్నాయి. వీరజవాన్ మల్లెపాకుల యాదయ్య జ్ఞాపకార్థం రూ.50 లక్షలతో గ్రంథాలయ భవనం నిర్మిస్తున్నారు. ఈ భవనం పనులు కూడా తుదిశకు చేరుకున్నాయి. ఈ ప్రాంతంలోని పాడి రైతులను దృష్టిలో ఉంచుకొని పాలశీతలీకరణ కేంద్రానికి రూ.90 లక్షలతో పక్కా భవనం ఏర్పాటు చేస్తున్నారు. రూ.50 లక్షలతో నిర్మిస్తున్న బీసీ కమ్యూనిటీ హాల్ పనులు ప్రగతిలో ఉన్నాయి. రూ.60 లక్షలతో గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించారు. రూ.18 కోట్లతో శ్రీశైలం హైవే నుంచి కొండారెడ్డిపల్లి శివారు వరకు నాలుగు లేన్ల రహదారి పనులు కొనసాతున్నాయి. కొండారెడ్డిపల్లి నుంచి వంగూరు మీదుగా సర్వారెడ్డిపల్లి గేటు వరకు డబుల్ రోడ్డును రూ.20 కోట్లతో మంజూరు చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.తొమ్మిది కోట్లను ఇచ్చారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఏడాదిలోపే గ్రామాభివృద్ధికి అధికంగా నిధులు మంజూరు చేయడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం కోసం దసరాకు సీఎం గ్రామానికి రానుండటంతో ఆలోగా పనుల పూర్తికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రూ.15 కోట్లతో సోలార్ విద్యుత్ వ్యవస్థ

రాష్ట్రంలో పూర్తిగా సోలార్ ఆధారిత విద్యుత్ గ్రామంగా కొండారెడ్డిపల్లిని తీర్చదిద్దనున్నారు. పీఎం సూర్య ముఫ్త్ బిజ్లీ యోజనలో భాగంగా దేశవ్యాప్తంగా జిల్లాకో గ్రామాన్ని సోలారైజ్డ్‌గా మార్చేందుకు కేంద్రం ఒక్కో పల్లెకు రూ.కోటి చొప్పున ఇస్తోంది. ఈ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కొండారెడ్డిపల్లిని ఎంపిక చేసింది. గ్రామంలో 499 గృహ, 66 వాణిజ్య, 867 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు కలిపి మొత్తం 1,451 కనెక్షన్లు ఉన్నాయి. ఈ నెల తొమ్మిదిన దక్షిణ డిస్కామ్ సీఎండీ ముషారఫ్ అలీ, కలెక్టర్ బదావత్ సంతోష్, రెడ్‌కో సీఎండీ అనిల్ గ్రామంలో పర్యటించి, సోలార్ ప్రాజెక్టు ప్రయోజనాలను వివరించారు. గ్రామంలోని అన్ని కనెక్షన్లకు కలిపి ఐదు మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుందని, ఒక్కో మెగావాట్‌కు రూ.3 కోట్ల చొప్పున మూడింటికి రూ.15 కోట్లు అవసరం అవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. గ్రామంలో ఇప్పటికే ఇంటింటి సర్వే పూర్తి చేశారు. ఫేస్-1 సర్వేలో 499 గృహ విద్యుత్ వినియోగదారులను గుర్తించారు.



పూర్తి కావచ్చిన గ్రంథాలయ భవనం



సోలార్ ప్రాజెక్టు ప్రయోజనాలను రైతుకు వివరిస్తున్న దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూకీ, కలెక్టర్ సంతోష్ (ఫైల్)

అదృష్టంగా భావిస్తున్నాం



మా గ్రామానికి చెందిన రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి సీఎం కావడం మా అదృష్టంగా భావిస్తున్నాం. రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో గ్రామానికి ఏడాదిలోపే పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేశారు. అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మరిన్ని నిధులు మంజూరు చేసి, రాష్ట్రంలో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని కోరుతున్నాం.

- అనిల్ యాదవ్, కొండారెడ్డిపల్లి

రూపురేఖలు మారుతున్నాయి



రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో మా గ్రామ రూపురేఖలు మారుతున్నాయి. రూ.కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతన్నాయి. మా గ్రామం ఇంతగా అభివృద్ధి జరుగుతున్నందుకు గర్వపడుతున్నా.

- వేమారెడ్డి, మాజీ ఉప సర్పంచ్, కొండారెడ్డిపల్లి

సీఎంకు కృతజ్ఞతలు



గ్రామంలోని ప్రతీ ఇంటికి, వ్యవసాయానికి సౌరవెలుగులు అందించనుండటంతో చాలా సంతోషంగా ఉంది. అధికారులు తొందరగా పనులు పూర్తి చేయించాలి. ఇంత మంచి పథకాన్ని గ్రామానికి తెచ్చి మేలు చేస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న.

- వంశీ, కొండారెడ్డిపల్లి



కొల్లాపూర్ మండలం అమరగిరి వద్ద కృష్ణానది తీరాన ఆకు పచ్చని కొండలు

అందాల అమరగిరి

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం అమరగిరి ప్రకృతి రమణీయతకు అద్దం పడుతోంది. చుట్టూ ఎత్తయిన పచ్చని కొండలు, పరుగులు పెడుతున్న కృష్ణానది కనువిందు చేస్తున్నాయి. కేరళ, ఊటీలను తలపిస్తున్న ఈ అందాలను చూసేందుకు పర్యాటకులు వరుస కడుతున్నారు. శని, ఆదివారాల్లో అధిక సంఖ్యలో వస్తున్నారు. నదిపై పడవల్లో విహరిస్తూ మంత్రముగ్ధులవుతున్నారు. ఇక్కడ నది తీరాన విడిది గదులను ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

- కొల్లాపూర్



పచ్చని కొండల మధ్య పారుతున్న కృష్ణానది



పర్యాటకుల కోసం సిద్ధంగా ఉన్న బోట్లు

నేడు సీఎం రేవంత్‌రెడ్డి రాక

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తండ్రి దశదినకర్మకు హాజరు
- ఏర్పాట్లను పరిశీలించిన డీజీపీ చౌహాన్, ఎస్పీ జానకి



జీఎంఆర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చిన్నచింతకుంట, సెప్టెంబరు 14: మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి తండ్రి క్రిష్ణారెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం రానున్నారు. ఈ సందర్భంగా దమగ్నాపూర్‌ను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. డీజీపీ చౌహాన్, ఎస్పీ జానకి హెలిప్యాడ్, దమగ్నాపూర్ గ్రామానికి వెళ్లే దారులను పరిశీలించారు. అంతకు ముందు ఎస్పీ మండలంలోని పెద్ద వడ్డెమాన్ గ్రామ సమీపంలోని పాఠశాల ఆవరణలో పోలీసు సిబ్బందితో బందోబస్తుపై చర్చించారు. సీఎం పర్యటన సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్ఐ శేఖర్ పాల్గొన్నారు.

పర్యటన షెడ్యూల్..

ఉదయం 11:03 గంటలకు బేగంపేట నుంచి హెలిక్యాప్టర్‌లో బయల్దేరి, 12:10 గంటలకు దమగ్నాపూర్ సమీపంలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 12:15 గంటలకు దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ తండ్రి కృష్ణారెడ్డి దశదినకర్మ కార్యమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు హెలిక్యాప్టర్ ఎక్కి, 1:50 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు.

పరామర్శించిన రాజగోపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తండ్రి మృతి చెందిన నేపథ్యంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, అమ్మాపూర్ సంస్థానాధీశుడు రాజా శ్రీరాంభూపాల్ జీఎంఆర్ కుటుంబాన్ని పరామర్శించారు. కృష్ణారెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.

300 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, సెప్టెంబరు 14: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోని ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో 300 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఈ సూరిబాబు శనివారం తెలిపారు. ఎగువ నుంచి వరద వస్తున్న కారణంగా ఎగువ, దిగువ రెండు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 11 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. గత నెల 17వ తేదీ నుంచి ఎగువ జల విద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా 167.923 మిలియన్ యూనిట్లు, 18వ తేదీ నుంచి దిగువ జల విద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 139.416 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశామన్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువ ఉత్పత్తి కేంద్రంలో 4.319 మిలియన్ యూనిట్లు, దిగువ ఉత్పత్తి కేంద్రంలో 4.149 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని తెలిపారు. వరద ఇదే స్థాయిలో కొనసాగితే విద్యుత్ ఉత్పత్తి రికార్డు స్థాయిని చేరుకునే అవకాశం ఉందని చెప్పారు.



దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

సంపూర్ణ ఆరోగ్య జిల్లాగా మార్చాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, సెప్టెంబరు 14 : నారాయణపేటను సంపూర్ణ ఆరోగ్య జిల్లాగా మార్చాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో శనివారం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సిద్దార్థ యోగా విద్యాలయం, పతంజలి యోగా సమితి, లయన్స్ క్లబ్ సౌజన్యంతో నిర్వహించిన ప్రకృతి ఆరోగ్య సదస్సు అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్ హాజరయ్యారు. మొదటగా సరస్వతీ మాత చిత్రపటానికి పూజలు చేసి, సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తరఫున మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు ఎక్కువ శాతం ఆలోపతిక్ వైద్యులే వచ్చారన్నారు. ఆలోపతిక్‌లో ప్రకృతికి సంబంధించిన మందులు ఉంటాయన్నారు. ప్రజలు ముఖ్యంగా ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలన్నారు. ప్రకృతి ఆరోగ్య సదస్సుల ద్వారా ప్రజలకు ఆరోగ్యంపై అగాహన పెరుగుతుందన్నారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చు అన్నారు. ప్రతీ రోజు యోగా సాధన చేయడంతో పాటు శరీరానికి కావాల్సిన ఆహారం తీసుకోవాలన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు శరీరాన్ని గౌరవించి, సమతుల్యమైన పోషకాహారం అందించాలన్నారు. ఆరోగ్యం అంటే రోగం లేకుండా ఉండడం కాదని మానసికంగా, ఆధ్యాత్మికంగా, సాంఘికంగా ఉండమమేనన్నారు. మనసు బాగుంటే శరీరం బాగుటుందని, శరీరం బాగుంటే సమస్తం బాగుంటుందన్నారు. అనంతరం ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ కేవై రామచంద్ర, డాక్టర్ పద్మ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్టన్ తెలంగాణ, ఏపీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ ఆరోగ్య సలహాలు అందించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ అనసూయ, డాక్టర్ విజయ్ ఎల్దండి, అల్లూరి శ్రీనివాస్, మునిసిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ్ భట్టడ్, డాక్టర్ నరసింహరావు సగరి, డాక్టర్ మల్లికార్జున్, జయచంద్ర మోహన్, రవికుమార్ గౌడ్, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా సౌత్‌జోన్ కబడ్డీ పోటీలు ప్రారంభం

- రెండు రాష్ట్రాల నుంచి పాల్గొన్న 45 జట్లు
- మూడు విభాగాల్లో పోటీలు ప్రారంభం

గద్వాల, సెప్టెంబరు 14: సీబీఎస్ఈ సౌత్ జోన్ రాష్ట్రాల బాలుర కబడ్డీ పోటీలకు గద్వాల వేదికైంది. ఎస్ఆర్ విద్యానికేతన్ పాఠశాలలో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని స్కూల్ గేమ్ ఫెడరేషన్ గద్వాల



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్



హోరాహోరీగా కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

జిల్లా కార్యదర్శి జితేందర్ క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీబీయస్ఈ వివిధ పోటీలను నిర్వహిస్తుండగా 7వ సౌత్ జోన్‌లో కబడ్డీ పోటీలు నిర్వహించడానికి గద్వాల వేదిక కావడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 46 పాఠశాలలకు చెందిన క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఇందులో అండర్-14కు 24 జట్లు, అండర్-17కు 21 జట్లు, అండర్-19కు 15జట్లు వచ్చాయని వివరించారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. క్రీడాస్ఫూర్తి ప్రదర్శించి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని తెలిపారు. 17వ తేదీ వరకు నిర్వహించే ఈ క్రీడాపోటీలు లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం కబడ్డీ పోటీలు మూడు విభాగాలలో ఒకేసారి ప్రారంభం అయ్యాయి.

పిల్లల పెంపకం ఎంతో బాధ్యత



మాట్లాడుతున్న గద్వాల డీటీవో ఉమాదేవి

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 14: పిల్లలను పెంచడం అనేది జీవితంలో ఎంతో బాధ్యతతో కూడుకున్న వ్యవహారమని గద్వాల జిల్లా డీటీవో ఉమాదేవి అన్నారు. శనివారం స్థానిక పారిశ్రామికవాడలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో నిర్వహించిన మహిళా సీనియర్ సిటిజన్ ఫోరం సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లితండ్రులు తమ పిల్లల చుట్టూ ఉన్న ప్రపంచంలోని సంక్లిష్టతలను విశ్లేషణ చేయగల బాధ్యతగా తీసుకొని, వారిని అభివృద్ధిలో కీలకమైన అంశంగా పరిగణించాలన్నారు. అధ్యక్షురాలు నాగశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సరోజ, చంద్రకళ, జగపతిరావు, ఎల్లారెడ్డి పలువురు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

వనపర్తి క్రైమ్, సెప్టెంబరు 14: విధుల్లో అలసత్వం వహించినందుకు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ రావుల గిరిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. వనపర్తి జిల్లా పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ ఎస్పీ ఉత్తర్వుల మేరకు వనపర్తి పట్టణం నందు ట్రాఫిక్ విధులకు వెళ్లాలని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ సూచించారు. కానిస్టేబుల్ ట్రాఫిక్ విధులకు వెళ్లనని ఎస్ఐతో గొడవ పెట్టుకుని ఎస్ఐ వ్యక్తిగత ల్యాప్‌టాప్ పగలగొట్టాడు. ఈ విషయంపై ఎస్ఐ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా కొత్తకోట సీఐ ఈ వివాదంపై విచారణ చేసి ఎస్పీకి నివేదిక అందించడంతో, విధులపై అలసత్వం ప్రదర్శించిన కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

ఆకట్టుకున్న అన్నమాచార్య కీర్తనలు



కీర్తనలు ఆలపిస్తున్న దీక్షితులు సుబ్రమణ్యం

వెల్దండ, సెప్టెంబరు 14 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో శ్రీసాయినగర్ వినాయక భక్తమండలి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ శ్రీకంఠ గాయకుడు డాక్టర్ దీక్షితులు సుబ్రమణ్యంచే నిర్వహించిన అన్నమాచార్య భక్తిగానలహరి ఆకట్టుకుంది. శ్రీ కంఠంతో పాడిన కీర్తనలు ఎంతగానో అలరించాయి. అనంతరం దీక్షితులు సుబ్రమణ్యంతో పాటుగా సభ్యులు ఆంజనేయులు, కృష్ణ, ప్రసాద్‌లను నిర్వాహకులు శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు.

కూలిన ఇల్లు .. తప్పిన ప్రమాదం


కూలిన ఇల్లు

కొత్తకోట, సెప్టెంబరు 14 : ఓ ఇల్లు కూలి పెను ప్రమాదం తప్పిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోటలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణంలోని 14వ వార్డులో అశోక్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి బయట మాట్లాడుకుంటూ కూర్చున్నారు. అంతలోనే అశోక్‌కు నిద్ర రావడంతో ఇంట్లోకి వెళ్లి మంచంపై పడుకున్నాడు. శబ్దం వస్తూ మట్టి, పైకప్పు కట్టెలు కింద పడడం గమనిస్తుండగా బయటకు వెళ్లలేక మంచం కిందకు అశోక్ దూరాడు. ఒక్కసారి మొత్తం ఇల్లు కూలింది. ఇంటి బయట ఉన్న భార్య కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్నవారు వచ్చి మట్టి, కట్టెలను తొలగించి అశోక్‌ను బయటకు తీశారు. విషయం తెలుసుకున్న మునిసిపల్ చైర్‌పర్సన్ సుకుశిని మార్కెట్ చైర్మన్ ప్రశాంత్ పరిశీలించారు.

పాముకాటుకు గురై యువకుడి మృతి


ఉపేంద్ర (ఫైల్)

గట్టు, సెప్టెంబరు 14: జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని చాగదోణకు చెందిన ఉపేంద్ర(16) శుక్రవారం అర్ధరాత్రి పాముకాటుకు గురై మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన మునెప్ప కుమారుడు ఉపేంద్ర శుక్రవారం పొలం పనులలో ఉండగా పాముకాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులకు తెలపడంతో గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూల్ ఆసుపత్రికి తరించగా అక్కడ చికిత్స పొందుతూ.. శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఉపేంద్ర మృతితో కుటుంబం విషాదంలో మునిగింది.

యువకుడి మృతిపై అనుమానాలు

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 14 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీకి చెందిన సాయినాథ్(27) శుక్రవారం తెల్లవారుజామున వంట గదిలో ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన అనుమానాలు రేకెత్తిస్తుంది. పోలీసులు మాత్రం ఆత్మహత్యగా కేసు నమోదు చేశారు. మృతుని కాళ్లకు తాడు కట్టుకుని ఫ్యాన్‌కు వేలాడుతున్న ఘటన జిల్లా కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. కాళ్లకు తాడు కట్టుకుని స్టూల్ ఎలా ఎక్కాడు? ఫ్యాన్‌కు ఎలా ఉరి పెట్టుకున్నాడని? పలు రకాల అనుమానాలకు తావిస్తుంది. మృతుడు, మృతుని తల్లి ఇద్దరే ఇంట్లో ఉండేవాళ్లు. తల్లి ఉద్యోగానికి వెళ్లినప్పుడు సాయినాథ్ మానసిక స్థితి బాగాలేదని ఇంట్లో ఉంచి తాళం బయటి నుంచి వేసి వెళ్లి.. సాయంత్రం వచ్చేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఒకవేళ ఆత్మహత్య చేసుకునేది ఉంటే ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఆత్మహత్యగా చేసుకోవాలని కానీ ఇంట్లో తల్లి ఉన్నప్పుడు అర్ధరాత్రి ఇంట్లోనే కిచెన్‌రూమ్‌లో ఫ్యాన్‌కు వేలాడుతూ మృతి చెందిన ఘటన పలు రకాల అనుమానాలకు తావిస్తుంది. సాయి మృతిపై లోతైన విచారణ జరిపితే కానీ అసలు విషయం తెలుస్తుంది.

కమ్యూనిస్టుల జీవితాలు.. సమాజానికి వెలుగులు

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- సీపీఎం నాయకురాలు లక్ష్మీదేవమ్మ మృతదేహం మెడికల్ కళాశాలకు అప్పగింత


లక్ష్మీదేవమ్మ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, ప్రముఖులు

పాలమూరు, సెప్టెంబరు 14: కమ్యూనిస్టుల జీవితాలు సమాజానికి వెలుగులు అందిస్తాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు అన్నారు. శనివారం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. శుక్రవారం మరణించిన సీపీఎం నాయకురాలు లక్ష్మీదేవమ్మ మృతదేహాన్ని జిల్లా కార్యాలయానికి తీసుకువచ్చారు. పూలమాలవేసి నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. మరణించిన తరువాత కమ్యూనిస్టులు సమాజానికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో మృతదేహాన్ని పాలమూరు మెడికల్ కళాశాలకు అప్పగించాలని లక్ష్మీదేవమ్మ కోరిక మేరకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. సీతారాం ఏచూరికి, ఆమెకు స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, నాయకులు ఒబేదుల్లా కొత్వాల్, వీ.పీ బెక్కెం జనార్దన్, డా.మధుసూదనరెడ్డి, ఎన్.పీ వెంకటేష్, సంజీవ్‌ముదిరాజు, ఐద్వా నాయకులు మల్లులక్ష్మి, అరుణజ్యోతి, ఆశాలత, సీపీఎం నాయకులు వి.పర్వతాలు, వెంకట్రామారెడ్డి, పుట్ట ఆంజనేయులు, ఆర్.రాంరెడ్డి, రాందాసు, కందికొండ గీత, సీపీఐ నాయకులు విల్సన్, లక్ష్మణ్‌గౌడ్ పార్టీలకు అతీతంగా నివాళి అర్పించారు. లక్ష్మీదేవమ్మ ఉమ్మడి జిల్లాలో సీపీఎం, ఐద్వా మహిళా సంఘం అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఊట్కూర్, సెప్టెంబరు 14 : నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని కొత్తపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ బృందం సివిల్ సప్లయ్ డీటీ కాళప్ప, పోలీసులు కలిసి శనివారం కొత్తపల్లిలోని పీర్ల చావడిలో నిల్వ ఉంచి బియ్యాన్ని పట్టుకున్నారు. 25 నుంచి 30 కిలోల బరువుగల 26 బస్తాలను పరిశీలించి రేషన్ బియ్యంగా గుర్తించారు. మొత్తం 7 క్వింటాళ్ల 80 కిలోల బియ్యం స్వాధీనం చేసుకుని, వాటిని నిల్వ ఉంచిన బిజ్వార్ చెందిన అబ్దుల్ పై కేసు నమోదు చేశారు.

చేప పిల్లల పంపిణీలో జాప్యం

- నేటికీ పూర్తికాని టెండర్ల ప్రక్రియ
- ఆలస్యమైతే ఎదుగుదల అంతంతే
- మత్స్యకారులలో సన్నగిల్లుతున్న ఆశలు

వీపనగండ్ల/ఆత్మకూరు, సెప్టెంబరు 14 : చేప పిల్లల పంపిణీలో జాప్యం జరుగుతుంది. చేప పిల్లలను చెరువులో వదలడంలో ఆలస్యమైతే వాటి ఎదుగుదలపై తీవ్ర ప్రబావం పడుతుంది. జులై, ఆగస్టు నెలలో వర్షాలు కురిసి చెరువులోకి నీరు చేరిన వెంటనే చేప పిల్లలను వదిలాలి. అందుకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి చేప పిల్లలను సిద్ధంగా ఉంచుకోవాలి. కానీ ఈ ఏడాది చెరువులు నిండిన చేపల పంపిణీ జరగడం లేదు. కనీసం టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కాకపోవడంతో మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.


ఆత్మకూరులో చేపలు పడుతున్న మత్స్యకారుడు (ఫైల్)

జిల్లాలో 992 చెరువులు..

వనపర్తి జిల్లాలో 950 చెరువులు, కుంటలు, మూడు రిజర్వాయర్లు ఉన్నాయి. 142 మత్స్య సహకార సంఘాలు ఉండగా, 13,650 మంది సభ్యులు ఉన్నారు. ఈ చెరువుల్లో రవ్వ, బొచ్చె, దూబొచ్చే, బంగారు తీగ, మోసు, వాలుగా చేపలు ఉంటాయి. చెరువులు రిజర్వాయర్లతో పాటు పక్కనే ఉన్న కృష్ణానదిలో మత్స్యకారులు చేపల వేట చేస్తూ జీవనోపాధి పొందుతుంటారు.

పూర్తికాని టెండర్ల ప్రక్రియ

జిల్లాలో కోటి 20 లక్షల చేప పిల్లలు పంపిణీ చేయాల్సి ఉంది. రవ్వ, బొచ్చె, బంగారు తీగ రకం చేపలు చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. చేప పిల్లల విడుదలకు ప్రభుత్వం టెండర్లకు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. గతేడాది బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవటమే కారణంగా కనిపిస్తుంది. ఆ డబ్బులు రాకపోగా మళ్లీ టెండర్‌లో పాల్గొంటే టెండర్ చార్జీలు, చేప పిల్లల కొనుగోలు, వాటి రవాణా ఖర్చులు భరించాల్సి ఉంటుంది. అంత పెట్టుబడి పెట్టలేమని పెండింగ్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేసినట్లు తెలుస్తుంది. ఆగస్టు చివరి వారంలో మరోసారి టెండర్లకు పిలిచారు.

ఆలస్యమైతే నష్టం..

చేపల పంపిణీలో జాప్యం జరిగితే వాటి ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. చెరువులోకి నీరు వచ్చిన వెంటనే జులై, ఆగస్టు నెలలో చేప పిల్లలు వదిలితే చేపలు ఎదిగి ఫిబ్రవరి వరకు కేజీ వరకు పెరుగుతాయి. కేజీ పైబడి పెరగాలంటే ఏప్రిల్ వరకు ఆగాలి. చెరువులో నీళ్లు ఉంటేనే ఆ స్థాయికి చేపలు పెరుగుతాయి. లేదంటే మొదటికే మోసం వస్తుందని మత్స్యకారులు వాపోతున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం నీళ్లు సరిగా లేకపోవడం వేడికి తట్టులేక చేపలు చనిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీంతో లాభాల మాట అటు ఉంచితే నష్టాలు చవి చూడాల్సి వస్తుందని మత్స్యకారులు వాపోతున్నారు.

నాసిరకం వదిలే అవకాశాలు..

చేపల పంపిణీలో ఆలస్యమైతే నాసిరకం చేపలు వదిలే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న చెరువులో కుంటల్లో 30-40 మిల్లీ మీటర్ల పొడవు ఉన్న చేప పిల్లలు విడుదల చేయాలి. రిజర్వాయర్ పెద్ద చెరువులో 80-100 మిల్లీ మీటర్ల పొడవు ఉన్న చేప పిల్లలు వదిలి పెంచుతారు. ఆలస్యమైతే కాంట్రాక్టర్లు నాసిరకం చేపలను వదిలేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఇదే జరిగితే నష్టాలు వస్తాయని త్వరగా పంపిణీ చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ఇది వరకే వదలాల్సి ఉండేది



మత్స్యకారులు ఆర్థిక అభివృద్ధి సాధించాలంటే ఇది వరకే చేప పిల్లలను చెరువులు, ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో విడుదల చేసి ఉంటే వేసవి నాటికి పెద్దవై పంట చేతికి వచ్చేది. దీని ద్వారా మత్స్యకారులు ఆర్థిక అభివృద్ధి సాధించేవారు.

- వాకిటి పరశురాం, మత్స్యకారుడు, ఆత్మకూరు

గతేడాది బిల్లు రాలేదు



గతేడాది చేప పిల్లలను ప్రభుత్వానికి అందజేసినా ఇప్పటి వరకు బిల్లు రాలేదు. రూ.86 లక్షలు రావాల్సి ఉండగా, రూ.18 లక్షలు మాత్రమే ఇచ్చారు. దీంతో అప్పులు తెచ్చి నాణ్యతమైన సీడ్స్‌ను ఉత్పత్తి చేస్తే, ప్రభుత్వం అరకొరగా బిల్లులు చెల్లించడంతో పరిస్థితి తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించాలి.

- ఏటికాడి ఆనంద్, చేపల ఉత్పత్తిదారుడు

తక్షణమే పంపిణీ చేయాలి



జిల్లాలో వేల సంఖ్యలో మత్స్యకారులు మత్స్య సంపదను ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ఇప్పటి వరకు చెరువుల్లో చేప పిల్లలను వదలకపోవడంతో మత్స్యకారుల పరిస్థితి ఆందోళన కలిగిస్తుంది. ప్రభుత్వం తక్షణమే చేప పిల్లలను వదిలే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలి.

- అశ్వినికుమార్, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు, ఆత్మకూరు

19న టెండర్లు తెరుస్తాం..



మొదటిసారి టెండర్లు పిలిస్తే కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. మరోసారి ఈనెల 19న టెండర్లు తెరుస్తాం. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే చెరువులలో చేప పిల్లలను విడుదల చేస్తాం. మత్స్యకారులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు.

- లక్ష్మప్ప, జిల్లా మత్స్యశాఖ అధికారి, వనపర్తి

మృతదేహంతో రాస్తారోకో

- నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్

మల్దకల్, సెప్టెంబరు 14: హత్యకు పాల్పడిన నిందితులను అరెస్ట్ చేయాలంటూ బాధిత కుటుంబసభ్యులు శనివారం మృతదేహంతో జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రానికి చేరుకుని మృతదేహంతో రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా.. మండలంలోని మద్దెలబండకు చెందిన బోయ నర్సింహులు (40) శుక్రవారం తన వ్యవసాయ పొలంలో మృతిచెందాడు. గమనించిన కుటుంబ సభ్యులు మల్దకల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందులో తమ కుమారుని మృతిపై అనుమానాలున్నాయని తండ్రి నర్సింహులు ఆరోపించారు. శనివారం మృతునికి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు. అప్పటికే పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మృతుని బంధువులు మృతదేహంతో మల్దకల్ బస్టాండ్ చౌరస్తాలో బైఠాయించి ధర్నాకు దిగారు. స్థానిక పోలీసులు సర్దిచెప్పినా వినిపించుకోలేదు. ఎస్పీ, కలెక్టర్ రావాలని పట్టుబట్టారు. ఒక దశలో బస్టాండ్ చౌరస్తాలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం దాటిన తర్వాత గద్వాల సీఐ నాగేశ్వరరెడ్డి, అలంపూర్ సీఐ రవిబాబు ఘటనా స్థలంలో బాధితులతో మాట్లాడారు.


మృతదేహంతో రోడ్డుపై ధర్నా చేస్తున్న కుటుంబసభ్యులు

దర్యాప్తు నిష్పక్షపాతంగా చేస్తామని నిందితులు ఎవరైనా అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు శాంతించారు. సుమారు నాలుగు గంటల పాటు ధర్నా చేయడంతో రోడ్డుపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రియురాలిని హత్య చేసిన ప్రియుడికి రిమాండ్

బల్మూరు, సెప్టెంబరు 14 : ప్రియురాలిని హత్య చేసి చెరువులో పారేసిన కేసులో నిందితుడిని గుర్తించి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 7న నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండల కేంద్రంలోని ఊర చెరువులో హత్యకు గురై తేలిన యువతి మృతదేహాన్ని అనుమానాస్పదంగా కేసు నమోదు చేసుకుని పూర్తి దర్యాప్తు చేశారు. మండల కేంద్రానికి చెందిన సొంటె శివరాముడు, ఇదే గ్రామానికి చెందిన అనూష(20)ను కొంతకాలంగా హైదరాబాద్‌లో ఒకే చోట పనిచేస్తుండడంతో వారిద్దరూ ప్రేమించుకున్నారు. ఈ సందర్భంలోనే పెళ్లి చేసుకోవాలని అనూష ఒత్తిడి చేయడంతో శివరాముడు బల్మూరుకు వచ్చేశాడు. ఆమె అలాగే ఫోన్‌లు చేసి ఇబ్బంది పెట్టడంతో తన బైక్ తీసుకుని హైదరాబాద్ వెళ్లి అనూషను మైలారం మీదుగా బల్మూరుకు తీసుకొస్తూ ఊరచెరువు సమీపంలో బైకును ఆపి ఆమె గొంతు నులిపి చెరువులో పడేసినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడు శివరాముడును కొల్లాపూర్ కోర్టులో శనివారం హాజరుపర్చి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదాలకు నిలయంగా కాజ్‌వే

- నిత్యం వరద ప్రవాహంతో కాజ్‌వే గుంతలమయం
- నది దాటేందుకు ప్రయత్నించి రెండేళ్ల క్రితం వ్యక్తి గల్లంతు

తాడూరు, సెప్టెంబరు 14 : కృష్ణానదికి ఉప నది అయిన దుందుభిలో తరుచూ వరద ప్రవాహాలకు ప్రమాదాలకు నిలయంగా మారింది. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిర్సవాడ నుంచి ఇటు మిడ్జిల్‌కు అటు కల్వకుర్తి వెళ్లేందుకు ప్రధానమైన లింకు రోడ్డు కావడంతో నిత్యం ఈ రహదారిపై రాకపోకలు రద్దీగా ఉంటాయి. ఈ క్రమంలో దుందు భి నదిలో ఉన్న లోలెవల్ కాజ్‌వే వరద ప్రవాహాల ధాటికి శిథిలావస్థకు చేరి గుంతలమయంగా మారింది. ఈ సమస్యలన్నింటినీ అధిగమించాలంటే కేవలం ఒక బ్రిడ్జి నిర్మాణంతోనే సాధ్యమవుతుందని నది పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు, వాహన దారులు భావిస్తున్నారు.


నది దాటుతున్న క్రమంలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన ఆటో (ఫైల్)

నిత్యం ప్రమాదాలు

గతంలో దుందుభి నది రెండు, మూడేళ్లకోసారి ప్రవాహాన్ని కొనసాగించగా నదిలో భూగర్భ జలాలు అడుగంటి వరద ప్రవాహం చాలా తక్కువగా ఉండేది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ప్రారంభమైనప్పటి నుంచి కాల్వల ద్వారా వచ్చిన సాగునీరు దుందుభి నదిలో సైతం కలవడం మూలంగా భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో నది పరివాహక ప్రాంతం వెంట ఎక్కడా వర్షం కురిసిన వరద ప్రవాహం తీవ్రస్థాయిలో ఉండడం, నదిలో ఉన్న కాజ్‌వే పూర్తి స్థాయిలో దెబ్బతినడం మూలంగానే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

దుందుభిలో జరిగిన ఘటనలు

దుందుభి నది ప్రవాహం ఎక్కువ స్థాయిలో వరద ప్రవాహాలు కొనసాగుతున్న కాలంలో 27 జులై, 2022న నలుగురితో ప్రయాణిస్తున్న ఆటో ప్రమాదవశాత్తు కాజ్‌వేపై నుంచి కిందకి పడిపోయింది. దీంతో గ్రామస్థుల సాయంతో నలుగురు వ్యక్తులను ప్రాణాలతో రక్షించారు. 7 సెప్టెంబరు, 2022న రాత్రి 7గంటల సమయంలో వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలోనే ఆర్టీసీ బస్సు 25 మంది ప్రయాణికులతో సిర్సవాడ నుంచి కల్వకుర్తికి వెళ్తున్న క్రమంలో అదుపు తప్పి నదిలోకి దూసుకుపోయింది. విషయాన్ని ఆర్టీసీ డ్రైవర్ గ్రామస్థులకు సమాచారమివ్వడంతో ట్రాక్టర్ల సాయంతో బస్సును బయటకు తీసుకొచ్చారు. 14 అక్టోబరు, 2022న సాయంత్రం 6గంటల సమయంలో సిర్సవాడ చెందిన చిన్న పర్వతాలు తన వ్యవసాయ పొలం నుంచి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో నది ఉధృతికి గల్లంతయ్యాడు. పోలీస్, అగ్నిమాపక శాఖ, ఎన్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు గాలింపు చర్యలు చేపట్టి కాజ్‌వే నుంచి సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో మృతదేహాన్ని గుర్తించారు. సెప్టెంబరు 1వ తేదీన ఇద్దరు వ్యక్తులు, 200గొర్రెలు నదిలో చిక్కుకున్న ఘటన చోటు చేసుకోవడంతో గ్రామస్థుల సమాచారం మేరకు కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించి మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఉండి వారిద్దరినీ గజ ఈతగాళ్ల పట్టి సాయంతో ఒడ్డుకు చేర్చారు. నది ప్రవాహం తగ్గిన తర్వాత గొర్రెలను క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. ఇదిలా ఉండగానే ఈ నెల 8న రాత్రి 9గంటల సమయంలో జడ్చర్ల మండలం ఆదిరాల చెందిన ఆరుగురు పెద్దవారు, ముగ్గురు చిన్నారులతో మొత్తం 9మంది వాహనంలో సోమ శిలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో దుందుభి నదిలో చిక్కుకుని ఆర్తనాదాలు చేయడంతో గ్రామస్థులు, పోలీసులు వారిని ప్రాణాలతో కాపాడిన ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ప్రజాప్రతినిధులు స్పందించి ఘటనలు పునరావృతం కాకుండా వంతెన నిర్మించాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.


కారులో చిక్కుకున్న 9మందిని కాపాడిన పోలీసులు, గ్రామస్థులు

బ్రిడ్జి నిర్మించాలి



ఇటీవల దుందుభి నదిలో జరుగుతున్న అన్ని ప్రమాదాలకు ఒకే ఒక పరిష్కారం బ్రిడ్జి నిర్మించడమే. కాజ్‌వేపై నుంచి వరద ప్రవాహం ఎక్కువగా క్రమంలో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సిర్సవాడ దుందుభి నది వద్ద బ్రిడ్జి నిర్మించి సామాన్యుల ప్రాణాలు కాపాడాలి.

- గంట వెంకటేశ్వర్‌రెడ్డి, సిర్సవాడ

ధ్వంసమైన కాజ్‌వే..



ఇటీవల తరుచూ దుందుభి నది ప్రవాహంతో లోలెవల్ కాజ్‌వే పూర్తిగా ధ్వంసమైపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. నిత్యం వరద వస్తున్న నేపథ్యంలో కాజ్‌వే పై నుంచి వెళ్లరాని పరిస్థితి నెలకొంది.

- లక్ష్మణ్‌గౌడ్, సిర్సవాడ

శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు


నందివడ్డెమాన్‌లో శనీశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, సెప్టెంబరు 14 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నంది వడ్డెమాన్‌లోని నందీశ్వరాలయం ఆవరణలోని శనీశ్వర స్వామికి శనివారం ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు నల్లని వస్త్రాలు ధరించి జిల్లెడు పూలు, నల్లని నువ్వులు, నల్లని వస్త్రం, నూవ్వుల నూనె వంటి పూజ సామగ్రితో స్వామికి ప్రత్యేక స్నానం ఆచరించి భక్తితో పూజలు చేశారు. అనంతరం నందీశ్వరాలయంలోని రుద్రేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, మహాగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థిపై ఉపాధ్యాయుడి దాష్టీకం

-పాఠశాలకు ఆలస్యంగా వస్తున్నాడని చితకబాదిన వైనం


బాలుడి కాళ్లపై పడ్డ వాతలు

బిజినేపల్లి, సెప్టెంబరు 14 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థిని విచక్షణ రహితంగా చితకబాదిన అమానుష ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు శని వారం సాయంత్రం తెలిపిన వివరాల మేరకు మండలం లోని ఓ గ్రామానికి చెందిన పదవ తరగతి చదువుతున్న బాలుడు పాఠశాలకు రోజు ఆలస్యంగా వస్తున్నాడని ఉపాధ్యాయుడు కర్రతో ఇష్టం వచ్చినట్లు వాతలు వచ్చేలా చితకబాదాడు. ఇంటికి వెళ్లిన బాలుడు విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. పాఠశాలకు ఆలస్యంగా వస్తే మందలించి సరైన సమయానికి విద్యార్థి వచ్చేలా తల్లిదండ్రులకు సమాచారం ఇస్తే సరిపోయేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

గణేష్ మండపాల వద్ద చోరీకి యత్నం

గద్వాల క్రైం, సెప్టెంబరు 14: జిల్లా కేంద్రంలోని గణేష్ మండపాల వద్ద గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించగా పట్టుకొని కాలనీవాసులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. జిల్లా కేంద్రంలోని నల్లకుంట కాలనీలోని గణేష్ మండపం వద్ద గుర్తుతెలియని ఇద్దరు యువకులు శనివారం మధ్యాహ్నం హుండీ, లడ్డు తదితర వాటిని ఎత్తుకెళ్తుండగా నిర్వాహకులు, స్థానికులు పట్టుకున్నారు. వారిని పట్టుకొని దేహశుద్ధి చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

వెల్దండ, సెప్టెంబరు 14 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని నగారాగడ్డతండాలో ముగ్గురు వ్యక్తులపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. తండాకు చెందిన శాంతి, గోవిందు, రాంజీలపై అదే గ్రామానికి చెందిన రాము, లక్ష్మన్ భూ తగాదాలతో దాడిచేశారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పేట మార్కెట్ చైర్మన్‌గా శివారెడ్డి


పేట చైర్మన్ శివారెడ్డి


వైస్ చైర్మన్ హన్మంతు

నారాయణపేట, సెప్టెంబరు 14 : నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జిలాల్‌పూర్ శివారెడ్డి, వైస్ చైర్మన్ పేటకు చెందిన కొనంగేరి హన్మంతును వరించింది. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి ఆశీస్సులు పొందడంలో ఇరువురు సఫలీకృతులు కావడంతో కొత్త పాలకవర్గం నియామకానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే చైర్మన్ పదవిని ఆశిస్తున్న యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవీందర్‌రెడ్డికి మరో పదవి ఇచ్చి న్యాయం చేస్తామని బుజ్జగించడంతో ఎట్టకేలకు కొత్త పాలకవర్గం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా దామరగిద్ద వెంకటప్ప, నర్సప్ప, ధన్వాడ రాగ్యానాయక్, రామ చంద్రయ్య, లక్ష్మమ్మ గౌడ్, నారాయణపేట బోయ శరణప్ప, హుస్సేన్, మరికల్ వినీతమ్మ, రాజారెడ్డి నియామకమైనట్లు సమాచారం.

బీటీ రోడ్డుకు పోలీసుల మరమ్మతు

నారాయణపేట రూరల్, సెప్టెంబరు 14 : నారాయణపేట మండలంలోని కొల్లంపల్లి స్టేజీ నుంచి లింగంపల్లికి వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు రూరల్ ఎస్‌ఐ సి.రాముడి ఆధ్వర్యంలో పోలీసులు కొల్లంపల్లి, లింగంపల్లి గ్రామస్థుల సహకారంతో శనివారం రోడ్డుకు మరమ్మతు చేశారు. కార్యక్రమంలో జడ్పీకోఆప్షన్ తాజుద్దీన్, ఎండీ గౌస్, బారు సాయిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటయ్య, సాయిలు, బాలు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో సభ్యత్వ నమోదు చేయాలి

మక్తల్ రూరల్, సెప్టెంబరు 14 : క్షేత్ర స్థాయిలో సభ్యత్వ నమోదు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య పేర్కొన్నారు. బీజేపీ జాతీయ, రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మండలంలోని మాద్వార్ గ్రామంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపు మెజార్టీ స్థానాలో ఉండాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కర్ని స్వామి, తాయప్ప పాల్గొన్నారు.

విజయోత్సవ సభ పోస్టర్ విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మరికల్, సెప్టెంబరు 14 : ఈ నెల 21న హైదరాబాద్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ విజయోత్సవ పోస్టర్లను శనివారం మండల కేంద్రంలోని నంది ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటానికి సామాజిక న్యాయం అమలు కావాలని దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ హైదరాబాద్‌లోని సూర్యచంద్ర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సభకు మాదిక ఉపకులాలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిరిసనోల్ల బాల్‌రాజ్, గండి బాల్‌రాజ్, నర్వ కృష్ణయ్య, రామస్వామి పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి


అవగాహన కల్పిస్తున్న సీఐ దస్రునాయక్

మద్దూర్/కొత్తపల్లి, సెప్టెంబరు 14 : పండుగలను శాంతియుతంగా జరుకోవాలని సీఐ దస్రునాయక్ అన్నారు. శనివారం కొత్తపల్లి మండలం భూనీడ్ గ్రామాన్ని సందర్శించి గ్రామ పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. గణేష్, మిలాద్-ఉన్-నబీ పండుగలను ఇరు వర్గాల ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుకోవాలని కోరారు. విద్వేషపూరిత పోస్టులు పెడితే సహిం చేది లేదన్నారు. మద్దూర్ ఎస్‌ఐ రామ్‌లాల్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

కోస్గి, సెప్టెంబరు 14 : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించారు. శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర లయన్స్ క్లబ్ శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా కోస్గికి చెందిన వీర మల్లేష్‌ను ఎంపిక చేసి, సన్మానించారు. విద్యార్థుల కోసం నిరంతరం కార్యక్రమాలు చేపడుతూ స్పోర్ట్స్ విద్యలోని పాఠ్యాంశాలను ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అర్థం చేసుకునే విధానంపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించడం, నారాయణ పేట జిల్లా ప్రత్యేకతపై ప్రతీ నెల ఆరు నెలల పాటు మాస పుస్తకం తయారు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టడంతో అయనను ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు. ఆయనతో పాటు మద్దూర్‌కు చెందిన మరో ఉపాధ్యాయుడు రాజును సైతం సన్మానించారు.

బ్యాంకు లోన్ పేరుతో రూ.కోటి టోకరా

కృష్ణ, సెప్టెంబరు 14 : బ్యాంకు లోన్ ఇప్పిస్తామని 60 మంది మహిళల నుంచి రూ.కోటి టోకరా వేసిన సంఘటన మండలంలోని గుడెబల్లూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సీపీరెడ్డి దంపతులు వివిధ ప్రైవేట్ ఫైనాన్స్‌ల ద్వారా ఐదు మంది మహిళలతో గ్రూప్‌గా చేసి 60 మంది మహిళల నుంచి ఆధార్, పాన్‌కార్డులు తీసుకున్నారు. మక్తల్, కర్ణాటక శక్తినగర్‌లోని బంధన్, లక్కీ, భారత్ ఇండివిజువల్ ఈ ఐదు బ్యాంకులలో ఒక్కో మహిళ పేరిట రూ.రెండు లక్షల లోన్ తీసి డబ్బులను నెల వారీగా తామే చెల్లిస్తామని నమ్మ బలికారు. తీరా చెల్లించకుండా ఉడాయించారు. బ్యాంకు సిబ్బంది లోన్ డబ్బులు చెల్లించడం లేదని మహిళల ఇళ్ల వద్దకు రావడంతో అసలు విషయం వెలుగుచూసింది. మహిళలు చాకలి లక్ష్మీ, లక్ష్మి, గజ్జలమ్మ, రాధమ్మ, రేణుక సీపీరెడ్డి ఇంటికి వెళ్లగా అప్పటికే ఆయన వెళ్లిపోవడంతో మోసపోయామని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఏచూరి సేవలు మరువ లేనివి



మక్తల్‌లో ఏచూరి చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

నారాయణపేట రూరల్/మక్తల్/మాగూరు, సెప్టెంబరు 14 : అణగారిన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పోరాడిన సీపీఎం జాతీయ నాయకుడు ఏచూరి సీతారాం సేవలు మరువ లేనివని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బాల్‌రాం అన్నారు. శనివారం మండలంలోని కోటకొండ గ్రామంలో ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. మంచి పార్లమెంటేరియన్‌గా పేరొందిన ఏచూరి ప్రతిపక్ష, అధికార పక్షాల మన్ననలు పొందిన గొప్పనేత అన్నారు. దేశం మంచి నేతను కోల్పోయిందన్నారు. సీపీఎం పార్టీ రథసారథి సీతారాం ఏచూరి మృతి పట్ల ఆ పార్టీ నాయకులు మక్తల్ పట్టణంలో ఏచూరి చిత్ర పటానికి పూలమాల నివాళి అర్పించారు. సీపీఎం ఏరియా కమిటీ నాయకులు ఆంజనేయులు మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి సంఘాలు, అఖిల భారత అధ్యక్షుడిగా, కేంద్ర కమిటీ సభ్యుడిగా పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనసాగుతూ మృతి చెందడం తీరని లోటు అన్నారు. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా విద్యాహక్కు, సమాచార హక్కు చట్టం తీసుకురావడంలో విశేష కృషి చేశారన్నారు. దేశంలో జరుగే మతోన్మాద వ్యతిరేక శక్తులను ఏకం చేశారన్నారు. మాగనూరు మండలంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు నివాళి అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు దస్తప్ప, బాలప్ప, గుండెగారి లక్ష్మయ్య, సుదర్శన్, నవీన్ పాల్గొనగా, మక్తల్‌లో నాయకులు లక్ష్మణ్, భరత్ కుమార్, వెంకటయ్య, నర్సింహ, డీవైఎఫ్‌ఐ నాయకులు బాలు, వెంకటప్ప, నాగులు, నర్సిములు, వెంకటేష్, రాయప్ప, శ్రీనివాసులు, రామక్రిష్ణ, మాగనూరులో నాయకులు వాకిటి వెంకటయ్య, గొల్ల నరేష్, రాఘవేంద్ర, నరసింహ, బాలు, మంగలి సురేష్, అశోక్, వెంకటేష్, సిద్దప్ప, బాల్‌రాజ్, హన్మంతు పాల్గొన్నారు.

ప్రజల ఆలోచనకు తగ్గట్టుగానే పాలన

- రాష్ట్రం అప్పుల్లో ఉన్నా ఏక కాలంలో రుణమాఫీ చేశాం
- ఎమ్మెల్యే వాకటి శ్రీహరి
- చిన్నపొర్ల, ఎడవెల్లి గ్రామాల్లో మహాలక్ష్మీ పథకం రూ.500 సిలిండర్ ప్రొసిడింగ్స్ పంపిణీ



మహిళలకు ప్రొసిడింగ్ పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వాటికి శ్రీహరి

ఊట్కూర్/నర్వ, సెప్టెంబరు 14 : ప్రజల ఆలోచన విధానానికి తగ్గట్టుగానే రాష్ట్రంలో ప్రభుత్వ పాలన కొనసాగుతోందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం మండలంలోని చిన్నపొర్ల, ఎడవెల్లి గ్రామాల్లో మహాలక్ష్మీ పథకంలో భాగంగా రూ.500 గ్యాస్ సిలిండర్ ప్రొసిడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు వందశాతం అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. దీనికి తగ్గట్టు గానే అధికారంలోకి వచ్చిన నెలలోపే మహిళలు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేశామన్నారు. ప్రతీ ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తున్నామన్నారు. వైస్ రాజశేఖర్‌రెడ్డి తరహాలో ఒకేసారి రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. ఒక్క చిన్నపొర్ల గ్రామంలోనే రూ.12 కోట్లు, ఎడవెల్లిలో రూ.10 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. రుణమాఫీ కాని వారికి సైతం గ్రామాల్లో ఏఈవోల ద్వారా వివరాలు సేకరించి మరీ రుణమాఫీ అందిస్తామన్నారు. అదే విధంగా రూ.500 గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పినట్లు గానే వారికి ప్రొసిడింగ్‌లను అందిస్తున్నామని, ఇప్పటికే వారి ఖాతాల్లో నగదు జమ చేయడం జరిగిందన్నారు. చిన్నపొర్లలో 381, ఎడవెల్లిలో 331 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇంకా మిగిలిన వారికి సైతం ఇస్తామన్నారు. తొమ్మిది నెలల పాలనలో ఒక చిన్నపొర్ల గ్రామానికే రూ.54 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. వర్షానికి ఇండ్లు కూలిపోయిన వారికి, మట్టి ఇండ్లు, రేకుల షెడ్డు ఉన్న వారికి సైతం వారు ఉంటున్న స్థలంలోనే పక్కా ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇస్తామన్నారు. ఇళ్లు కూలిపోయిన వారికి గతంలో రూ.1000, రూ.2000 వేలు ఇచ్చేవారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి రూ.16,500 పరిహారం ఇస్తున్నారన్నారు. అంతకు ముందు నర్వ మండల పరిషత్ కార్యాలయం వద్ద మహిళలకు మహాలక్ష్మి పథకం ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఊట్కూర్ పీఏసీఎస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, తహసీల్దార్ రవి, ఎంపీడీవో ధనుంజయ్‌గౌడ్, ఏవో గణేష్‌రెడ్డి, ఎస్‌ఐ కృష్ణంరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సూర్యప్రకాష్‌రెడ్డి, మణెమ్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజ్ఞేశ్వర్‌రెడ్డి, నాయకులు వెంకటేష్‌గౌడ్, జనార్ధన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రిషి కుమార్, ఆరీఫ్, జలాల్, చిన్నపొర్ల మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, నాయకులు ప్రశాంత్, హుస్సేన్, బాపురం నర్సింహులు, జాఫర్, జావీద్ పాల్గొనగా, నర్వలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్, కృష్ణారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, కృష్ణయ్య, శరణప్ప, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వివేక్‌రెడ్డి పాల్గొన్నారు.

విభాగ్ స్థాయి గణిత విజ్ఞాన మేళా




ప్రదర్శనలు తిలకిస్తున్న విభాగ్ కార్యదర్శి ఎల్లప్ప, జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్

నారాయణపేట, సెప్టెంబరు 14 : నారాయణపేట సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా విభాగ్ స్థాయి గణిత విజ్ఞాన మేళా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా పాల్గొన్న విభాగ్ కార్యదర్శి ఎల్లప్ప, జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ మాట్లాడుతూ సైన్స్‌ఫేర్‌లు విద్యలో ఉత్సుకత, విమర్శనాత్మకత ఆలోచన ప్రయోగాత్మకత అభ్యాసనాన్ని పెంపొందిస్తుందన్నారు. విద్యార్థులు మంచి శాస్త్రీయ భావాలను అన్వేషించడానికి అవకాశాలను అందిస్తారన్నారు. ప్రశ్నలు అడగడానికి, ప్రయోగాలు చేయడానికి ఫలితాలను స్వతంత్రంగా విశ్లేషించడానికి వారిని ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు పరిశోధనలతో తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారన్నారు. గణిత శాస్త్ర ఆవిష్కరణలు చేస్తారన్నారు. కార్యక్రమంలో విద్యాపీఠం అధ్యక్షులు రతంగ్‌పాండ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జి.బాల్‌రాజ్, కృష్ణయ్య, దూస సీతారాములు, లక్ష్మయ్య గౌడ్, ప్రసాద్ శెట్టి, వెంకట్రాములు, భాను ప్రకాష్, దత్తు చౌదరి పాల్గొన్నారు.

గణనాథులకు కొనసాగుతున్న పూజలు


సాయి హనుమాన్ కాలనీలో ప్రత్యేక పూజలో పాల్గొన్న మహిళలు

నారాయణపేట/నర్వ, సెప్టెంబరు 14 : గణేశ్ నవరాత్రుల్లో భాగంగా శనివారం నారాయణపేటలోని పలు వినాయక విగ్రహాల దగ్గర ప్రముఖులు ప్రత్యేక పూజల్లో పాల్గొని, అన్నదాన కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ మెయిన్ రోడ్‌లోని శ్రీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఐలు శివశంకర్, రామ్‌లాల్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, శ్రీ ఫ్రెండ్స్ నవీన్, సంపత్, సురేష్, శివ, వెంకట్, రాజు, ఇర్ఫాన్ పాల్గొన్నారు. సాయి హనుమాన్ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయకునికి ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ గీతా విశ్వనాథ్, ఆర్యసమాజ్ మంత్రి నాగమ్మ, విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకట్రామారెడ్డి పూజలు చేశారు. డాక్టర్ గీత, శ్యామల, విజయలక్ష్మి, రాధిక, సువర్ణ, రజిత, స్వాతి, శివరాజ్, జైపాల్‌రెడ్డి, పాల్గొన్నారు. పత్తి బజార్‌లో యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి దగ్గర డీలర్ అశోక్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగూరావు నామాజీ, నందు నామాజీ, మిర్చి వెంకటయ్య, సిద్దివెంకట్రాములు, సైదప్ప, సత్య నారాయణ, శ్రీనివాస్, కాకార్ల భీమయ్య, జంగిటి వెంకటేష్ పాల్గొన్నారు. పళ్ల యువ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో వినాయకుడికి ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం నిర్వహించారు. నర్వ మండల కేంద్రంలోని కర్రెమ్మ గుడి వద్ద ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద బొజ్జన్న ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. బీఆర్ఎస్ మండల నాయకులు అయ్యప్ప, పెద్దింటి ఆంజనేయులు, పుత్రసేన, మాసన్న పాల్గొన్నారు.


శ్రీ ఫెండ్స్ వినాయక మండపం వద్ద ఎస్పీని సన్మానిస్తున్న దృశ్యం

గణనాథులను దర్శించుకున్న ఎంపీ డీకే అరుణ

మరికల్ : మండల కేంద్రంలోని కుర్వగేరి, హనుమాన్‌వాడ, హరిజన్‌వాడ, ఇందిరాగాంధీ చౌరస్తా, అశోక్‌నగర్ కాలనీల్లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు గణనాథులకు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎంపీని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో చిన్ననర్సన్ గౌడ్, రమేష్, వేణు, వెంకటేష్, మహేందర్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు. అంతకు ముందు నారాయణపేట పళ్ల దీక్షిత్ నివాసంలో నిమజ్జనం ఎరుగని వినాయకుడిని శనివారం రాత్రి ఎంపీ డీకే అరుణ దర్శించుకొని పూజలు నిర్వహించారు.

మత్స్య సహకార సంఘాల బలోపేతానికి కృషి



ఊట్కూర్ సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఊట్కూర్, సెప్టెంబరు 14 : మత్స్య సహకార సంఘాలను పూర్తి స్థాయిలో బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కేంద్ర సహకార మంత్రిత్వశాఖ ఏపీ, టీజీ ఇన్‌చార్జి ఎస్ఎల్‌టీ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఊట్కూర్ మత్స్య సహకార భవనంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్స్యకార సంఘం సభ్యులకు ఉపాధి అవకాశాలను పెంచి, ఆర్థికంగా అభివృద్ధి చేయడానికే సంస్థ పని చేస్తోందన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నడుచుకుంటూ సంఘం సమావేశాలు, ఆడిటింగ్ సకాలంలో చెల్లిస్తే ప్రభుత్వం సంఘానికి రుణాలు అందిస్తుందన్నారు. ఈ రునాలు సకాలంలో చెల్లించి మళ్లీ తీసుకుని ఉపాధి అవకాశాలు పొందవచ్చు అని తెలిపారు. అంతకుముందు మత్స్య గ్రంధి సహకార సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల చైర్మన్ పూలబోయినర భీమన్న, మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి సంపత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పథకాలను మత్స్యకారులకు అందేలా కృషి చేస్తోందన్నారు. అందరం కలిసి సంఘం అభివృద్ధికి కృషి చేస్తే ఆర్థిక అభివృద్ధి జరుగుతుందన్నారు. సదస్సులో ఊట్కూర్ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు వసంత్‌కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు హన్మంతు, శివరామరాజు, మత్స్య గ్రంధి సహకార సంఘం ప్రతినిధి రామకృష్ణ, డైరెక్టర్లు రమేష్, వసంత్, లక్ష్మప్ప పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్


హిందీ ఉపాధ్యాయులను సన్మానించిన లయన్స్ క్లబ్ సభ్యులు


విజేతలకు బహుమతులు అందిస్తున్న మునిసిపల్ వైస్ చైర్మన్

నారాయణపేట,మక్తల్ సెప్టెంబరు 14 : హిందీ భాష భారతదేశం యొక్క ఆత్మ అని హిందీ ప్రచార్ సమితి అధ్యక్షుడు, మునిసిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ భట్టడ్, హిందీ ప్రొఫెసర్ నర్సింహరావు కల్యాణి అన్నారు. శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని హిందీ ప్రచార సమితిలో జరుపుకోన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. దేశ అభివృద్ధి జాతీయ భాష ద్వారానే సాధ్యం అన్నారు. హిందీ భాషాను 150 దేశాల్లో బోధిస్తున్నారని జాతీయ భాషతో పాటు అంతర్జాతీయ భాషాగా గుర్తింపు పొందిందన్నారు. కార్యక్రమంలో ఆత్మరామ్ ఏడ్కే, అమర్నాథ్ కాంబ్లే, సఖిదేవ్, విఠల్‌రావు, శ్రీనివాస్, సుధీర్, సత్యనారాయణ, శంకర్, దీపక్, నర్సింహ, అరవింద్, రామకృష్ణ, ఉజ్వల, అనురాధ పాల్గొన్నారు.

- మక్తల్ పట్టణంలోని లయన్స్ క్లబ్ భవనం వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు డీవీ చారీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు హిందీ భాషా గొప్పదనంపై వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. హిందీ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, భీమేష్, వాకిటి లక్ష్మి, విజయలక్ష్మి, సంధ్య, నరేందర్, మునెప్ప, సహారా, సనాను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి అంజన్‌ప్రసాద్, సభ్యులు కట్ట వెంకటేష్, ఉపాధ్యాయులు సందీప్, అంబ్రేష్, దామోదర్ పాల్గొన్నారు.

దీక్ష విరమణ

కృష్ణ, సెప్టెంబరు 14 : ఆలయంలో దళితుల వివాహాన్ని అడ్డుకున్న పూజారి చక్రపాణిని అరెస్టు చేయడంతో దీక్ష విరమిస్తున్నట్లు ముడుమాల్ న్యాయ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. యాదవేంద్రస్వామి ఆలయంలో దళితుల వివాహం అడ్డుకున్న పూజారి చక్రపాణిని వెంటనే అరెస్టు చేయాలని రిలే దీక్షలు చేపట్టిన విషయం విధితమే. ఎట్టకేలకు చక్రపాణిని అరెస్టు చేయడంతో దీక్ష విరమిస్తున్నట్లు న్యాయ పోరాట కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

దామరగిద్ద, సెప్టెంబరు 14 : మండల కేంద్రంతో పాటు మల్‌రెడ్డిపల్లి, లోకుర్తి గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయకులకు నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, శరణ్‌నాయక్, తమ్మలి రఘు, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలో వసతులు కల్పించాలి

నారాయణపేట టౌన్, సెప్టెంబరు 14 : తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో వసతులు కల్పించాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం హాస్టల్‌ను పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, పీవైఎల్ నాయకులు సందర్శించి, మాట్లాడారు. వసతి గృహ విద్యార్థుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్రభుత్వం వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెబుతుందని, కానీ క్షేత్ర స్థాయిలో హాస్టల్ వార్డెన్‌లు వసతులు కల్పించడం లేదని వాపోయారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నారాయణపేట టౌన్, సెప్టెంబరు 14 : నేడు నారాయణపేట జిల్లా కేంద్రంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఏఈ రఫీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ లైన్ ఫీడర్‌లోని సాయివిజయ కాలనీ, సింగార్ బేస్, సరాఫ్ బజార్, దర్గా ఏరియా, కుమ్మరి వాడ, అగ్రహార్‌పేట్, చిల్డ్రన్స్ ఆసుపత్రి, పాత బస్టాండ్ తదితర కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ధన్వాడ, సెప్టెంబరు 14 : ధన్వాడ మండల కేంద్రంలోని శ్రీరాం నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద శుక్రవారం రాత్రి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురి ని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు నాటికలు, నృత్యాలతో పాటు పాటలు పాడారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జుట్ల సుదర్శన్‌గౌడ్, కురుమూర్తి, మాదరం రవికుమార్‌గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

ధన్వాడలో ముందస్తు చర్యలు


ధన్వాడలో మందు పిచికారి చేస్తున్న వైద్య సిబ్బంది

ధన్వాడ, సెప్టెంబరు 14 : మండల కేంద్రంలో చాలా మంది జ్వరాల బారిన పడటంతో ముందస్తు జాగ్రత్తగా వైద్య సిబ్బంది చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కోటపక్క వీధిలో ఇంటింటికీ స్ప్రే చేశారు. కాగా ఇటీవల ధన్వాడలో డెంగీ లక్షణాలతో ఓ బాలుడు మృతి చెందగా, మరో ఇద్దరికి డెంగీ లక్షణాలు ఉండటంతో జిల్లా కేంద్రంలో చికిత్సలు నిర్వహించారు. అదే విధంగా పలు కాలనీల్లో ప్రజలు రోగాలతో బాధపడుతుండగా, వైద్య సిబ్బంది కతలప్ప, ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండి పరిశుభ్రత పాటించాలని సలహాలు ఇస్తున్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

ధన్వాడ, సెప్టెంబరు 14 : రాబోవు స్థానిక ఎన్నికల్లో సత్తా చాటే విధంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరహరి అన్నారు. మండల కేంద్రమైన ధన్వాడలో శనివారం మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 17 నుంచి నిర్వహించే 'ప్రజాపాలన' దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చే దిశగా ముందుకెళ్తుందన్నారు. రూ.రెండు లక్షలకు పైగా రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు చీరాల సుధాకర్‌రెడ్డి, కందనూర్ రహిమన్‌ఖాన్, చిట్టెం రాఘవేందర్‌రెడ్డి, ఆనంద్ గౌడ్, కిష్టాపూర్ మాజీ సర్పంచ్ చిట్టెం దమోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం విజయవంతం

కృష్ణ, సెప్టెంబరు 14 : మండలంలోని కున్సి గ్రామ శివారులో శనివారం నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరానికి ఎమ్మెల్యే వాటికి శ్రీహరి హాజరై మాట్లాడారు. కస్తూర్‌రాజ్ మోక్ష అరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా ఉచిత ఆయుర్వేద చికిత్సలు అందించడం అభినందనీయం అన్నారు. విజయ్‌రాజ్‌తిలక్ 103వ జయంతిని పురస్కరించుకొని జైన మందిరంలో దాదాపు 1000 మందికి వైద్య చికిత్సలు నిర్వహించి, ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, సిద్దలింగమహాస్వామి, క్షీరలింగస్వాములను జైన మందిర ట్రస్టు కమిటీ అధ్యక్షుడు శరణ్‌కిరణ్ శాలువా, పూలమా లతో సన్మానించారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్ జైన్, శివరాజ్, పిట్టల సిద్దప్ప, సోమశేఖర్‌గౌడ్, రాజప్పగౌడ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొత్తపల్లి, సెప్టెంబరు 14 : మండలంలోని తిమ్మారెడ్డిపల్లికి చెందిన సీపీఐ మండల నాయకుడు రాజిరెడ్డి కుటుంబాన్ని జిల్లా నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజిరెడ్డి మృతి మండల పార్టీకి తీరనిలోటు అని జిల్లా సమితి సభ్యులు అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కొండన్న, నాయకులు వెంకటేశ్, సంతోష్, నర్సిములు, వెంకటేష్ ఉన్నారు.